24న రెండోవ వాక్ ఇన్ కౌన్సిలింగ్

ఏజీవర్సిటీ: ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం వివిధ డిప్లొమా కోర్సులలో మిగిలిన సీట్ల భర్తీకి వాక్ ఇన్ కౌన్సిలింగ్ (నేరుగా) ఈ నెల 24 నిర్వహించడం జరుగుతుందని విశ్వ విద్యాలయం రిజిస్ట్రార్ రఘురామిరెడ్డి తెలిపారు. ఇందులో సీట్ల భర్తీకై ఇప్పటి వరకు మూడు విడుతలు కౌన్సిలింగ్, ఒక వాక్ ఇన్ కౌన్సిలింగ్ నిర్వహించడం జరిగిందని, రెండవ వాక్ఇన్ కౌన్సిలింగ్ నిర్వహించడం జరుగుతుందన్నారు. 24న 10 గంటలకు ఎగ్జామినేషన్స్ సెంటర్ వాటర్ టెక్నాలజీ సెంటర్ రాజేంద్రనగర్ నందు నిర్వహించడం జరుగుతుందని, ఇందులో పాలీసెట్–2024లో ర్యాంకులు పొందిన వారికి మొదటి ప్రాధాన్యత ఇవ్వడం జరుగుతుందని, ఎస్ఎస్‌సీలో ప్రథమ స్థానం వచ్చిన వారికి రెండవ ప్రాధాన్యత ఇవ్వడం జరుగుతుందని సూచించారు. ఆసక్తి గత అభ్యర్థులు నేరుగా ఒరిజినల్ సర్టిఫికెట్స్ నిర్ణీత ఫీజుతో హాజరు కావాలని సూచించారు.

సీఎంకు వినతిపత్రం


సీఎంకు వినతి పత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే

శంషాబాద్: జీవో 111 కారణంగా నిధుల లేమితో శంషాబాద్ అభివృద్ధిలో వెనుకబడిందని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ సీఎం రేవంత్ రెడ్డికి వివరించారు. ఈ నేపథ్యంలో మంగళవారం సీఎం ఇంటికి వెళ్లిన ఆయన నియోజకవర్గంలో పట్టణ, పల్లె ప్రాంతాల కలయికతో ఉన్న శంషాబాద్‌కు భారీగా నిధులు కేటాయించాలని కోరారు. అదే విధంగా రాజేంద్రనగర్‌లోని 5 డివిజన్‌ల అభివృద్ధితో పాటు గండిపేటలో ప్రభుత్వ జూనియర్ కళాశాలను మంజూరు చేయాలని సీఎంకి వినతి పత్రం అందజేశారు.

కాలనీలలో పర్యటించిన కార్పొరేటర్


ముంపు ప్రాంతాలను పరిశీలిస్తున్న కార్పొరేటర్

మైలార్‌దేవ్‌పల్లి: డివిజన్ పరిధిలోని కాటేదాన్, బంజార కాలనీ, దుర్గానగర్, ఎన్టీఆర్ నగర్‌లో కార్పొరేటర్ తోకల శ్రీనివాస్‌రెడ్డి మంగళవారం అధికారులతో పర్యటించారు. ఇళ్లల్లోకి వరద నీరు చేరడంతో జీహెచ్‌ఎంసీ ఎమర్జెన్సీ టీమ్‌తో క్లీన్ చేయించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. డివిజన్‌లోని కాలనీలలో వరుద నీరు చేరి ప్రజలకు ఇబ్బందులు కలుగజేస్తే వెంటనే తమ దృష్టికి తీసుకురావాలని ప్రజలను కోరారు. జీహెచ్‌ఎంసీ ఎమర్జెన్సీ టీమ్ ప్రజలకు అందుబాటులో ఉండాలంటూ సూచించారు. ఈ కార్యక్రమంలో జీహెచ్‌ఎంసీ వర్క్ ఇన్‌స్పెక్టర్ రాహుల్, భాను, పార్టీ నాయకులు బుచ్చిరెడ్డి, చందు, శేఖర్, రాజు తదతరులు పాల్గొన్నారు.

గృహ హింసను మహిళలు ఎదిరించాలి


మహిళలతో మాట్లాడుతున్న మహ్మద్ నజీబ్

గోల్కొండ: గృహ హింసను మహిళలు ఎదిరించాలని పీస్ ఫోర్స్ సొసైటీ నగర అధ్యక్షుడు మహ్మద్ నజీబ్ అన్నారు. షేక్‌పేట్‌కు చెందిన పలువురు మహిళలు టోలిచౌకిలోని సొసైటీ కార్యాలయంలో మహ్మద్ నజీబ్‌ను కలిశారు. ఈ సందర్భంగా పలువురు మహిళలు తమ పట్ల జరుగుతున్న గృహ హింసపై ఆయనకు ఫిర్యాదు చేశారు. కుటుంబ సభ్యులే తమను నానా విధాలుగా వేధిస్తున్నారని పిల్లల బాగు కోరి తాము దౌర్జన్యాలను భరిస్తున్నామన్నారు. గృహహింసపై మన చట్టాలు పక్కాగా ఉన్నాయని మహిళలను హింసించే వారికి చట్టం ప్రకారం కఠినమైన శిక్షలు ఉన్నాయని అన్నారు. అయితే మహిళలు ధైర్యంగా కౌన్సెలింగ్ సెంటర్లకు వచ్చి హింసకు వ్యతిరేకంగా నోరువిప్పాలన్నారు.

బాధ్యతల స్వీకరణ


లక్ష్మీ ప్రియ

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ సర్కిల్ జీహెచ్ఎంసీ కార్యాలయం టౌన్ ప్లానింగ్ విభాగం సెక్షన్ అధికారిగా లక్ష్మీప్రియ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. మహబూబ్‌నగర్ మున్సిపాలిటీలో విధులు నిర్వహిస్తున్న లక్ష్మీప్రియను రాజేంద్రనగర్ సర్కిల్‌కు బదిలీ చేయడంతో ఆమె కార్యాలయానికి వచ్చి బాధ్యతలు చేపట్టారు. గతంలో పని చేసిన కబీర్ తప్పుడు నివేదిక కేసులో సస్పెండ్‌కు గురై జైలుకు వెళ్లాడు. ఈ సందర్భంగా లక్ష్మీప్రియ మాట్లాడుతూ.. ఇంటి నిర్మాణం చేపట్టేవారు తప్పనిసరిగా జీహెచ్ఎంసీ నుంచి అనుమతులు తీసుకోవాలన్నారు. జీహెచ్‌ఎంసీ అనుమతులను ఆన్‌లైన్ ద్వారా అందజేస్తుందన్నారు. సులభమైన పద్ధతిలో అనుమతులు అందిస్తుందని, దళారులను నమ్మి మోస పోవద్దన్నారు.

వరద నీటి తొలగింపు పనుల పరిశీలన


పనులను పరిశీలిస్తున్న కమిషనర్ శరత్‌చంద్ర

బండ్లగూడ: కార్పొరేషన్ పరిధిలోని డాన్ బాస్కో రోడ్, పిఅండ్‌టి కాలనీ, 60 ఫీట్ రోడ్ తదితర ప్రాంతాల్లో వర్షానికి నిలిచిన నీటిని తొలగించే పనులను మంగళవారం మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ బి.శరత్‌చంద్ర పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వర్షాల కారణంగా ప్రజలకు ఇబ్బందులు లేకుండా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఈ కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ నరేష్, శానిటరీ జవాన్లు నరేందర్, లక్ష్మీనారాయణ, సిబ్బంది సంతోష్, వేణుగోపాల్, నర్సింహ్మా, హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

దంచి కొట్టింది.. దడ పుట్టించింది


జలమయమైన లోతట్టు ప్రాంతాలు

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలో మంగళవారం ఉదయం కుండపోత వర్షం కారణంగా లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. దాదాపు రెండు గంటల పాటు కురిసిన భారీ వర్షానికి ప్రధాన రహదారులు, అంతర్గత బస్తీల్లో వరదనీరు ఏరులై పారాయి. దీంతో ప్రధాన రహదారులతో పాటు అంతర్గత బస్తీల్లో వరదనీరు నిలిచిపోవడంతో వాహనదారులు, స్థానికులు ఇబ్బందులకు గురైయ్యారు. ఈ నేపథ్యంలో రాజేంద్రనగర్, సాయినగర్, వర్మ కాలనీ ప్రాంతాల్లో వరదనీరు నిలిచిపోయి ఇళ్లల్లోకి చొచ్చుకురావడంతో స్థానికులు నానా అగచాట్లు పడ్డారు. ప్రధాన రహదారులతో పాటు ఇళ్లల్లో నిలిచిన వరదనీటిని జీహెచ్‌ఎంసీ సిబ్బంది మోటార్ల ద్వారా తొలగించారు. ముంపు ప్రాంతాలను రాజేంద్రనగర్ సర్కిల్ ఉపకమిషనర్ రవి కుమార్ సందర్శించారు. ప్రజలకు, వాహనదారులకు, వ్యాపారస్తులకు ఇబ్బంది కలుగకుండా తక్షణ చర్యలు చేపట్టాలని అధికారులకు, సిబ్బందికి ఆదేశాలు జారీ చేశారు.


లోతట్టు ప్రాంతాలను పరిశీలిస్తున్న జీహెచ్‌ఎంసీ డిప్యూటీ కమిషనర్

ఎమ్మెల్యేకు ముస్లిం నాయకుల కృతజ్ఞతలు


ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపిన మైనార్టీలు


ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలుపుతున్న బోటిగూడ వాసులు

మణికొండ: పెరుగుతున్న ముస్లిం జనాభాకు అనుగుణంగా మణికొండ మున్సిపాలిటీలో సరైన ఖబ్రస్థాన్ లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్న విషయాన్ని తెలుసుకున్న ఎమ్మెల్యే టి. ప్రకాష్‌గౌడ్ 5 ఎకరాల భూమిని కేటాయింప చేశారు. ఈ నేపథ్యంలో నెక్నాంపూర్ రెవెన్యూ పరిధిలోని సర్వే నెంబర్ 44లో కబ్రస్థాన్‌కు 5 ఎకరాల భూమి కేటాయించేందుకు కృషి చేసిన ఎమ్మెల్యేను మైనారిటీ నాయకులు మంగళవారం కృతజ్ఞతలు తెలిపి సత్కరించారు. మణికొండ కౌన్సిలర్ కె. రామకృష్ణారెడ్డి, మైనార్టీ నాయకుడు బషీర్‌ల ఆధ్వర్యంలో వారు ఆయనను కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కబ్రస్థాన్‌లో అవసరమైన సౌకర్యాల కల్పనకు రాబోయే రోజుల్లో కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు శ్రీరాములు, శ్రావణ్‌కుమార్, కుమార్‌లతో పాటు మైనార్టీ నాయకులు పాల్గొన్నారు.

శంషాబాద్ రూరల్: మండలంలోని బోటిగూడను పంచాయతీగా ఏర్పాటుకు చేయడానికి ప్రభుత్వం చర్యలు తీసుకోవడం సంతోషకరమని గ్రామస్తులు మంగళవారం సంతోషం వ్యక్తం చేశారు. రామంజాపూర్ పంచాయతీకి అనుబంధంగా ఉన్న బోటిగూడను ప్రత్యేక పంచాయతీగా ఏర్పాటు చేయాలని స్థానికులు చాలా కాలం నుంచి కోరుతున్నారు. ఈ మేరకు ప్రభుత్వం గెజిట్ విడుదల చేసిందని, త్వరలోనే ఉత్తర్వులు వెలువడుతాయని స్థానికులు పేర్కొన్నారు. దీంతో గ్రామస్తులు ఎమ్మెల్యే టి.ప్రకాష్‌గౌడ్‌ను కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానికులు బిక్షపతి, సురేష్, శ్రీకాంత్, కిష్టయ్య, పోచయ్య, యాదగిరి, తదితరులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి


మృతుడి కుటుంబానికి చెక్కును అందజేస్తున్న ఫాయల్ ఫుడ్ యాజమాన్యం

మైలార్‌దేవ్‌పల్లి: విద్యుదాఘాతంతో వెల్డర్ మృతి చెందిన ఘటన మైలార్‌దేవ్‌పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. సోమవారం కాటేదాన్ పారిశ్రామిక వాడలోని పయాల్ ఫుడ్ ప్రైవేట్ లిమిటెడ్ బిస్కెట్ పరిశ్రమలో పని చేస్తున్న కార్మికుడు మోసీన్ ఖాన్ (34) వెల్డింగ్ పనులు చేస్తూ విద్యుదాఘాతంతో అక్కడికక్కడే మృతి చెందాడు. అతని స్వస్థలం మీర్జాపూర్ ఉత్తరప్రదేశ్ టీఎన్జీవోస్ కాలనీలో నివసిస్తున్నారు. 9 సంవత్సరాల నుంచి పరిశ్రమలో మెయింటెనెన్స్ క్రింద వెల్డింగ్ పనులు చేస్తున్నాడు. అతనికి భార్య, ఓ కూతురు (5), కుమారుడు (3)తోపాటు ప్రస్తుతం భార్య గర్భవతిగా ఉంది. దీంతో ఫాయల్ ఫుడ్ యాజమాన్యం మానవతాదృక్పథంతో 14లక్షల 80వేల రూపాయలను ఆర్థిక సహాయాన్ని సీఐటీయూసీ రంగారెడ్డి జిల్లా కార్యదర్శి వనంపల్లి జైపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో మృతుడి భార్యకు అందజేశారు.

‘ఎకోసెంట్రిక్ పార్కు’ పనులు ఎన్నాళ్లు ?


థీమ్ పార్కులో నిర్మిస్తున్న వాకింగ్, సైకిల్‌ట్రాక్

శేరిలింగంపల్లి: గచ్చిబౌలి డివిజన్‌లోని నల్లగండ్ల హుడాకాలనీలో నాలుగు ఎకరాల్లో ‘ఎకో సెంట్రిక్ పార్కు’ పేరిట రూ.2.60 కోట్ల వ్యయంతో నవంబర్ 5 తేదీ 2022లో ఎమ్మెల్యే గాంధీ, కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి తదితరులు పనులకు శంకుస్థాపన చేశారు. అయితే రెండేళ్లయినా అవి పూర్తి కావడం లేదు. ఈ పార్కులో ఇప్పటి వరకు సివిల్‌వర్క్‌లో భాగంగా 80 శాతం పనులు పూర్తి చేశారు. మిగతా 20 శాతం పనులకు నిధుల విడుదలలో జాప్యం పార్కుపై ప్రభావం చూపుతోంది. పార్కులో సైకిల్ ట్రాక్, వాకింగ్ ట్రాక్ ఓపెన్ ఎయిర్ థియేటర్ పనులు దాదాపు చివరి దశలో ఉన్నాయి. పరగోలాస్, టాయిలెట్స్ నిర్మాణ దశలో ఉన్నాయి. పార్కు ఆర్చి నిర్మాణ పనులు ఇంకా మొదలు కాలేదు. ఎకో సెంట్రిక్ పార్కు నిర్మాణం చేస్తున్న రోజుల్లోనే స్థానికులంతా కలిసి దీనికి ‘విశ్వామిత్ర పార్కు’ గా నామకరణం కూడా చేసుకున్నారు. పార్కు ఏర్పాటు కోసం కేటాయించిన స్థలంలో ఉన్న సహజసిద్ధంగా ఉన్న భారీ బండరాళ్లను తొలగించకుండా అలాగే ఉంచేలా ఏర్పాట్లు చేయాలని స్థానికులు కోరుతున్నారు. రాతి సంపదను కొనసాగిస్తూనే పార్కును రాక్‌జోన్‌గా ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.


నల్లగండ్ల హుడా కాలనీలో అభివృద్ధి చేస్తున్న ఎకో సెంట్రిక్ పార్కు

ఘన స్వాగతం

రాజేంద్రనగర్: బీజేపీ పార్టీ ఇన్‌చార్జిగా నియమితులైన అభయ్ పాటిల్‌ను మంగళవారం శంషాబాద్ రాజీవ్‌గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయంలో బీజేపీ నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రోటోకాల్ సహ ఇన్‌చార్జి మధుసూదన్, జిల్లా ప్రధాన కార్యదర్శి వై.శ్రీధర్, జిల్లా కార్యదర్శి ఎం.కొమరయ్య, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

సర్కిల్ ఏఎంఓహెచ్‌గా డాక్టర్ శ్రీకాంత్‌రెడ్డి

శేరిలింగంపల్లి: శేరిలింగంపల్లి సర్కిల్ అసిస్టెంట్ మెడికల్ ఆఫీసర్ ఆఫ్ హెల్త్ (ఏఎంఓహెచ్)గా డాక్టర్ పి శ్రీకాంత్‌రెడ్డి మంగళవారం పదవీ బాధ్యతలు చేపట్టారు. గోషామహల్ సర్కిల్‌లో పనిచేస్తున్న శ్రీకాంత్‌రెడ్డికి శేరిలింగంపల్లికి పోస్టింగ్ ఇవ్వగా ఇక్కడ పని చేసిన నగేష్ నాయక్‌ను ఎల్‌బీనగర్ సర్కిల్‌కు బదిలీ చేశారు.

రచయిత డా.ముత్యం కన్నుమూత

శేరిలింగంపల్లి: శేరిలింగంపల్లి గుల్‌మొహర్ పార్కు కాలనీకి చెందిన రచయిత డాక్టర్ ముత్యం (65)మంగళవారం తెల్లవారుజామున కన్నుమూశారు. గత కొంతకాలంగా ఆయన అనారోగ్యంతో బాధపడుతున్నారు.పాపిరెడ్డి కాలనీ శ్మశానవాటికలో అంత్యక్రియలు నిర్వహించారు. ఆయనకు భార్య అపర్ణ, కూతురు ప్రత్యూష, కుమారుడు వసంత్ ఉన్నారు. డాక్టర్ ముత్యం శాతవాహన యూనివర్సిటీ తెలుగు అధ్యాపకులుగా పని చేసి పదవీ విరమణ పొందారు. ఆయన ఉస్మానియా యూనివర్సిటీలో పీజీ, బెనారస్ హిందూ యూనివర్సిటీలో పీహెచ్‌డీ పూర్తి చేశారు. డాక్టర్ ముత్యం రచనలను రెండు రకాలుగా చూడవచ్చు. ముఖ్యంగా ఉత్తరాంధ్ర సాహిత్య పరిశోధనా రచనలు, తెలంగాణ ప్రాంత రచనలు, సేకరణలు అనేకం ఉన్నాయి.

ఎన్ కన్వెన్షన్‌పై చర్యలు తీసుకోండి

గచ్చిబౌలి: మాదాపూర్‌లో ఎన్ కన్వెన్షన్ పేరిట తమ్మిడి చెరువును కబ్జా చేశారని బీజేపీ రాష్ట్ర నాయకులు, జనం కోసం అధ్యక్షుడు కసిరెడ్డి భాస్కర్‌రెడ్డి హైడ్రా కమిషనర్ రంగనాథ్‌కు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశారు. శిల్పారామం ఎదురుగా తమ్మిడి చెరువు 29.24 ఎకరాల విస్తీర్ణంలో ఉందన్నారు. కన్వెన్షన్ నిర్మాణ సమయంలో 3.30 ఎకరాల స్థలాన్ని కబ్జా చేశారని ఫిర్యాదులో పేర్కొన్నారు. తమ్మిడి చెరువు పూర్తి విస్తీర్ణ, ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్ మ్యాప్‌లను ఫిర్యాదుతో పాటు అందజేశారు. తమ్మిడి చెరువును పునరుద్ధరించాలని కసిరెడ్డి కోరారు.

ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా చర్యలు

చాంద్రాయణగుట్ట: స్టేషన్ పరిధిలో ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకుంటామని ఫలక్‌నుమా ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ ఎస్.మోహన్ రావు అన్నారు. ఇటీవల నూతనంగా బాధ్యతలు చేపట్టిన ఆయన మంగళవారం సాక్షితో మాట్లాడుతూ.. ఫలక్‌నుమా, ఇంజన్‌బౌలి, శంషీర్‌గంజ్, అలియాబాద్, లాల్‌దర్వాజా మోడ్, ఛత్రినాక చౌరస్తా, ఒవైసీ ఆసుపత్రి జంక్షన్‌లలో అవసరమైన మేరకు సిబ్బందిని అందుబాటులో ఉంచుతామన్నారు. ముఖ్యంగా వ్యాపార సముదాయాల వద్ద వాహనాల పార్కింగ్ రోడ్డుపై పెట్టకుండా నిర్వాహకులు చూసుకోవాలన్నారు. ట్రాఫిక్ నియమాలు ఉల్లంఘించిన వారికి ఛలానాలు విధిస్తామని తెలిపారు.

ఐసీయూలో చికిత్స పొందుతున్న ఫార్మసిస్ట్


ప్రమాదానికి గురైన ఫార్మసిస్ట్ హారికరెడ్డి

అత్తాపూర్: రోడ్డు దాటుతుండగా ప్రమాదవశాత్తు గాయపడిన ఘటన అత్తాపూర్‌లో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. అత్తాపూర్ గ్రామానికి చెందిన హారికరెడ్డి మొయినాబాద్‌లో ఉన్న భాస్కర మెడికల్ కళాశాలలో బి-ఫార్మసీ పూర్తి చేసింది. ఇటీవల హైటెక్ సిటీలో ఉన్న ఓ ఫార్మసీ కంపెనీలో ఉద్యోగం చేస్తుంది. రోజు మాదిరిగానే మంగళవారం ఉదయం ఏడున్నర గంటల ప్రాంతంలో పీవీ నరసింహారావు వెలివేటెడ్ ఎక్స్‌ప్రెస్ వే-130 పిల్లర్ కాంతారెడ్డి పెట్రోల్ పంపు సమీపంలో ఉన్న ఫార్మసీ కంపెనీ బస్సు ఎక్కేందుకు తండ్రి రాంరెడ్డితో కలిసి రోడ్డు దాటుతుండగా, రాజేంద్రనగర్ నుంచి అత్తాపూర్ వైపు వస్తున్న మినీ బస్సు హారికరెడ్డిని ఢీకొంది. ఈ ఘటనలో అచేతనంగా పడివున్న హారికను స్థానికులు ప్రీమియర్ ఆసుపత్రిలో చేర్చారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

నిందితులను ఉరి తీయాలి

బండ్లగూడ: కోల్‌కత్తలోని హాస్పిటల్‌లో ట్రైనీ డాక్టర్‌ను అత్యాచారం చేసి హత్య చేసిన వారిని వెంటనే ఉరి తీయాలని మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ లతాప్రేమ్‌గౌడ్ అన్నారు. మంగళవారం బండ్లగూడలో విద్యార్థులు, ఆశావర్కర్లు, కాలనీల మహిళలు, సిబ్బందితో కలిసి ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మేయర్ ముఖ్య అతిథిగా హాజరై ర్యాలీని ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. కోల్‌కత్తలో జరిగిన ట్రైనీ డాక్టర్‌పై అత్యాచారం చేసి హత్య చేయడం చూస్తే వైద్యుల ప్రాణాలకు రక్షణ ఎక్కడ ఉందంటూ ఆమె ప్రశ్నించారు. ప్రభుత్వం వెంటనే స్పందించి నింతులకు కఠిన శిక్ష పడేలా చూడాలని కోరారు.


ర్యాలీ నిర్వహిస్తున్న మేయర్ లతాప్రేమ్‌గౌడ్ తదితరులు

బైండ్ల కులస్తులు

హక్కుల సాధనకు కలిసికట్టుగా పోరాడాలి


కడియం శ్రీహరితో శివశంకర్

గోల్కొండ: బైండ్ల కులస్తులు తమ హక్కుల సాధన కోసం కలిసికట్టుగా పోరాడాలని మాజీ ఉప ముఖ్యమంత్రి, ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. గోల్కొండ జగదాంబిక మహంకాళి అమ్మవారి వృత్తిపని వారి సంఘం అధ్యక్షుడిగా ఎన్నికైన శివశంకర్ మంగళవారం ఆయనను కలిశారు. శివశంకర్ మాట్లాడుతూ.. జగదాంబిక అమ్మవార్ల కుల వృత్తుల వారి సంఘం కృషి వల్ల నేడు కులవృత్తుల వారికి గౌరవంతో పాటు రాష్ట్ర దేవాదాయ శాఖ వారి గుర్తింపు కూడా లభించిందన్నారు. సంఘం అధ్యక్షుడిగా సాయిబాబాచారి 14 ఏళ్ల పాటు కులవృత్తుల వారి సంక్షేమం కోసం పోరాటం చేశారన్నారు. ఆయన వెంట కుల వృత్తుల వారు ఆర్.నర్సింగ్‌రావు, శంకర్, అశోక్, నవీన్ తదితరులున్నారు.

కూచిపూడి నృత్య కళాకారులకు సన్మానం



చాంద్రాయణగుట్ట: స్వతంత్ర్య దినోత్సవ వేడుకల్లో భాగంగా భాషా సాంస్కృతిక శాఖ, మంజుల డాన్స్ అకాడమీల సంయుక్తాధ్వర్యంలో సోమవారం రాత్రి చిక్కడపల్లిలోని శ్రీ త్యాగరాయ గాన సభలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. కూచిపూడి నృత్య ప్రదర్శనలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన ఉప్పుగూడ అశోక్‌నగర్‌కు చెందిన పార్వతి అక్షయ, గండి గీతిక శ్రీలను ముఖ్యఅతిథిగా హాజరైన సరస్వతి ఉపసకులు దైవాజ్ఞ శర్మ, డాన్స్ అకాడమీ నిర్వాహకురాలు మంజులతో కలిసి మెమొంటో, ప్రశంసాపత్రాలను అందజేసి సన్మానించారు.

అభివృద్ధి పనులను సత్వరమే పూర్తి చేయాలి


పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే జాఫర్ హుస్సేన్

యాకుత్‌పురా: బస్తీల్లో కొనసాగుతున్న అభివృద్ధి పనులను సత్వరమే పూర్తి చేయాలని యాకుత్‌పురా ఎమ్మెల్యే జాఫర్ హుస్సేన్ మేరాజ్ అధికారులకు సూచించారు. యాకుత్‌పురా, రెయిన్‌బజార్, ఎస్ఆర్టీ కాలనీ, సూపర్ బజార్, బడాబజార్, ఈస్ట్ చంద్రానగర్ తదితర ప్రాంతాల్లో కొనసాగుతున్న అభివృద్ధి పనులను మంగళవారం ఆయన కార్పొరేటర్ మహ్మద్ వసీవుద్దీన్, పలు విభాగాల అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ప్రజా సమస్యల పరిష్కారానికి ఎప్పటికప్పుడు చర్యలు తీసుకుంటున్నామన్నారు. వర్షాకాలంలో వరద నీటి సమస్యలు తలెత్తకుండా పలు ప్రాంతాల్లో నత్తనడకన కొనసాగుతున్న అభివృద్ధి పనులను సత్వరమే పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. ఈ పర్యటనలో మజ్లిస్ పార్టీ నాయకులు, జీహెచ్ఎంసీ, జలమండలి అధికారులు పాల్గొన్నారు.

భారీ వర్షాలకు నష్టపోయిన వారిని ఆదుకుంటాం


రోడ్డుపై నిలిచిన వర్షపు నీటిని తొలగిస్తున్న మాన్‌సూన్ టీమ్


కార్వాన్‌లో జీపులో పర్యటించి వర్షం వివరాలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే కౌసర్

గోల్కొండ: భారీ వర్షాలకు నష్టపోయిన వారిని తప్పకుండా ఆదుకుంటామని ఎమ్మెల్యే కౌసర్ మోహియుద్దీన్ అన్నారు. మంగళవారం ఉదయం 5 నుంచి 8 గంటల వరకు ఆయన తన జీపులో కార్వాన్ నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన ముందుగా నీట మునిగిన టోలిచౌకి చౌరస్తాను తన జీపు నుంచే పరిశీలించారు. అనంతరం ఆయన హకీంపేట్ బుల్కాపూర్ నాలా పూర్తిగా వర్షం నీటితో నిండిన శాతం చెరువు, నయాకీలా కందకాలను పరిశీలించారు. అదే విధంగా వర్షం పడ్డప్పుడల్లా తమ షాపులు, హోటల్స్‌లో భారీగా వర్షం నీరు చేరుతుందని దీనికి శాశ్వత పరిష్కారం చూపించాలని పలువురు వ్యాపారులు ఆయనను కోరారు. వర్షాకాలం పూర్తయ్యేలోపు సమస్య పరిష్కారం అవుతుందని ఎమ్మెల్యే వారికి హామీ ఇచ్చారు.

ఎట్టకేలకు రోడ్లపై మాన్‌సూన్ స్పెషల్ టీమ్‌లు

గోల్కొండ: ఇన్నాళ్లుగా వర్షాలు పడితే తమకేమి అన్నట్లు వ్యవహరించిన మాన్‌సూన్ టీమ్ వారు ఎట్టకేలకు రంగంలోకి దిగారు. రెండు రోజులుగా మాన్‌సూన్ స్పెషల్ టీమ్‌లు రోడ్లపై నిలిచి ఉన్న వర్షపు నీటిని తొలగిస్తు వస్తున్నారు. దీంతో ఓహో ఈ టీమ్‌లు ఇంకా పని చేస్తున్నాయా అంటూ పలువురు వ్యంగ్యంగా కామెంట్ చేస్తున్నారు. రెండు రోజుల క్రితం గోల్కొండ, నానల్‌నగర్‌లలో పర్యటించిన ఎమ్మెల్యే మాన్‌సూన్ టీమ్‌లు ఎక్కడ అని జలమండలి, బల్దియా అధికారులను ప్రశ్నించారు. దీంతో మాన్‌సూన్ స్పెషల్ స్క్వాడ్‌లు టోలిచౌకి, గోల్కొండ, హకీంపేట్ తదితర ప్రాంతాల్లో డ్రైనేజీ మ్యాన్‌హోల్స్‌ను శుభ్రం చేస్తూ కనపడ్డారు.